నేటి మ్యాచ్ | గుజరాత్ X పంజాబ్ రా.7.30 నుంచి | వేదిక అహ్మదాబాద్





# మాయావి విఘ్నేశ్

## ముంబై జట్టులో ఆటో డ్రైవర్ కొడుకు

**అంతర్జాతీయ స్థాయిలో అనుభవం లేదు. దేశవాళీలోనూ ఒక్క మ్యాచ్ ఆడలేదు. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడిన అనుభవమూ తక్కువే. అవతలి వైపు చూస్తే ఎంతటి బౌలర్‌నైనా చిత్తు చేసే బ్యాటింగ్ దళం. స్పిన్నర్లను మిక్సీలో వేసి తాఫీగా జ్యూస్ చేసుకుని తాగే బ్యాటర్లు. క్రీజులో రుతురాజ్ దంచుతుంటే ఇక మ్యాచ్ ముగిసినట్టే! అనుకుంటున్న చెన్నై ఇన్నింగ్స్‌లో భారీ కుదుపు. ముంబై సారథి సూర్య చేతి నుంచి బంతినందుకున్న 24 ఏండ్ల కుర్రాడు.. సీఎస్‌కేను ముప్పు తిప్పలు పెట్టాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత దిగ్గజ సారథి ధోనీ ప్రశంసలు అందుకున్న కేరళ కుర్రాడు విఘ్నేశ్ పుతుర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్.**

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

ఐపీఎల్ అంటే ధోనీ, రోహిత్, కోహ్లీ, స్టార్క్, మిల్లర్, బట్లర్ వంటి అంతర్జాతీయ స్టార్లే కాదు. ఎంతోమంది ఔత్సాహిక క్రికెటర్లు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు ఈ లీగ్‌ను మించిన వేదిక మరొకటి ఉండదు. ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న క్రికెటర్లు ఎంతోమంది.. తాజాగా ఆ జాబితాలో చేరేందుకు నేనున్నానని దూసుకొచ్చాడు విఘ్నేశ్ పుతుర్. 24 ఏండ్ల ఈ మళప్పురం (కేరళ) కుర్రాడు.. ఆదివారం చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 32 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి ఆరంభ మ్యాచ్‌లోనే అదరహో అనిపించాడు. స్పిన్‌ను బాగా ఆడగలరన్న పేరున్న రుతురాజ్, దూబె, దీపక్ హుడా వంటి బ్యాటర్లను ఔట్ చేసి ముంబైని రేసులోకి తీసుకొచ్చాడు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా విఘ్నేశ్ స్పిన్‌కు మహేంద్రసింగ్ ధోనీ కూడా ఫిదా అయ్యాడంటే ఈ కుర్రాడి అమ్ములపొదిలో ఇంకా ఎన్ని అస్త్రాలు దాగున్నాయో!

### ఆటో డ్రైవర్ కొడుకు..

కాలికట్ యూనివర్సిటీలో ఎంఏ లిటరేచర్ (ఇంగ్లిష్) చదువుతున్న విఘ్నేశ్‌ది సాధారణ మధ్య తరగతి కుటుంబం. తండ్రి సునీల్ కుమార్ ఆటో డ్రైవర్. తల్లి బింధు గృహిణి. చిన్ననాటి నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్న విఘ్నేశ్.. ఆటలో మెళుకువల కోసం మళప్పురం నుంచి త్రిసూర్‌కు మారిపోయాడు. కాలేజీ స్థాయిలో రాణించిన ఈ కుర్రాడు.. కేరళ క్రికెట్ లీగ్‌లో ఆడటం అతడికి కలిసొచ్చింది. ముంబై ఇండియన్స్ బృందం అతడిలోని ప్రతిభను గుర్తించింది ఇక్కడే. ఆ తర్వాత తమిళనాడు ప్రీమియర్ లీగ్ లోనూ సత్తా చాటిన విఘ్నేశ్‌ను ఐపీఎల్ వేలంలో ముంబై రూ.30 లక్షల ధరతో దక్కించుకుంది. కేరళ తరఫున సీనియర్ క్రికెట్‌లో ఆడే అవకాశం రాని అతడు.. అండర్-23 జట్టుకు మాత్రం ఆడాడు.

### తీర్చిదిద్దిన ముంబై..

విఘ్నేశ్ ప్రతిభను గుర్తించిన ముంబై.. వేలంలో దక్కించుకోగానే అతడిని సానబెట్టింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన సౌతాఫ్రికా టీ20 లీగ్ (ఎస్ఏ20)కు గాను డర్బన్ విమానమెక్కించింది. అక్కడ విఘ్నేశ్ ఎంఐ కేప్‌టౌన్ జట్టుకు నెట్ బౌలర్‌గా సేవలందించాడు. రషీద్ ఖాన్ వంటి స్పిన్నర్‌తో కలిసి బౌలింగ్ వేయడం విఘ్నేశ్‌కు కలిసొచ్చింది. ఎడమ చేతివాటం స్పిన్నర్ అయిన విఘ్నేశ్‌ను ఎదుర్కోవడానికి నెట్స్‌లో రోహిత్, సూర్య వంటి మేటి బ్యాటర్లు కూడా ఇబ్బంది పడటంతో చెన్నైతో ఆడేందుకు అతడికి లైన్ క్లియర్ అయింది. అతడు సంధించే ఫ్లైటెడ్ డెలివరీలు, గూగ్లీలకు సమాధానమేలేకుండా పోయింది.

# అశుతోష్ అద్భుతః

## లక్నోపై ఢిల్లీ ఉత్కంఠ విజయం

## మార్ష్, పూరన్ మెరుపులు వృథా



అశుతోష్ (66*)

**113/6. 210 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో 13 ఓవర్లకు ఢిల్లీ స్కోరిది. ప్రధాన ఆటగాళ్లంతా పెవిలియన్ చేరగా క్రీజులో అశుతోష్ శర్మ ఒక్కడే బ్యాటర్. కానీ విప్రజ్ నిగమ్ అండగా విశాఖ తీరాన అశుతోష్ అద్భుతమే చేశాడు. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ మధ్యప్రదేశ్ కుర్రాడు.. తాజా సీజన్‌లో ఢిల్లీ తరఫున ఆడిన తొలి మ్యాచ్‌లోనే 'మ్యాచ్ విన్నింగ్' ఇన్నింగ్స్ ఆడాడు. దొరికిన బంతిని దొరికట్టుగా బౌండరీ లైన్ అవతలకు పంపించిన అతడు చివరి దాకా క్రీజులో నిలిచి అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ క్యాపిటల్స్‌కు ఉత్కంఠ విజయాన్ని అందించాడు.**

విశాఖపట్నం: ఐపీఎల్ -18వ సీజన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ థ్రిల్లింగ్ విక్టరీతో ఆరంభించింది. సోమవారం విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో రసవత్తరంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ.. లక్నోపై ఒక వికెట్ తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. లక్నో నిర్దేశించిన 210 పరుగుల ఛేదనను ఢిల్లీ.. మరో మూడు బంతులు మిగిలుండగానే 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అశుతోష్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్‌కు తోడు విప్రజ్ నిగమ్ (15 బంతుల్లో 39, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (22 బంతుల్లో 34, 1 ఫోర్, 3 సిక్సర్లు) పోరాటం ఆ జట్టును విజయపథాన నిలిపింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 75, 6 ఫోర్లు, 7 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 72, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) దంచికొట్టినా బౌలర్ల వైఫల్యంతో ఆ జట్టు ఓటమి వైపు నిలవక తప్పలేదు. అశుతోష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### అశుతోష్ అదుర్స్..

భారీ ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే చేతులెత్తేసి 15 ఓవర్ దాకా అసలు రేసులోనే లేదు. తొలి రెండు ఓవర్లకే ఆ జట్టు జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ (1), అభిషేక్ పొరెల్(0), సమీర్ రిజ్వి(4) వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో కెప్టెన్ అక్షర్ (22)తో కలిసి డుప్లెసిస్ (29) ఆదుకునే యత్నం చేశాడు. కానీ వరుస ఓవర్లలో అక్షర్, డుప్లెసిస్ నిష్క్రమణతో ఆ జట్టు పోరాటం మళ్లీ మొదటికొచ్చింది. స్టబ్స్, అశుతోష్ ఆరో వికెట్‌కు 48 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే స్టబ్స్‌ను 13వ ఓవర్లో సిద్ధార్థ్ బౌల్డ్ చేశాడు. ఢిల్లీ విజయానికి ఆఖరి 7 ఓవర్లలో 93 పరుగులు చేయాల్సి ఉండగా క్రీజులోకి వచ్చిన విప్రజ్.. అశుతోష్‌తో కలిసి లక్నోను భయపెట్టాడు. బిష్ణోయ్ 14వ ఓవర్లో రెండు బౌండరీలు ఓ భారీ సిక్సర్ బాదాడు. ప్రిన్స్ యాదవ్ 16వ ఓవర్లో అశుతోష్ 6,4 కొట్టగా విప్రజ్ కూడా రెండు ఫోర్లు సాధించడంతో ఢిల్లీ రేసులోకి వచ్చింది. కానీ దిగ్వేష్ 17వ ఓవర్లో విప్రజ్ ఔట్ అయినా ఆఖర్లో అశుతోష్ పోరాటం ఆ జట్టును విజయతీరాలకు చేర్చింది.

### మార్ష్, పూరన్ విధ్వంసం

లక్నో ఇన్నింగ్స్‌లో మార్ష్, పూరన్ ఆటే హైలైట్. ఆ జట్టు 209 పరుగులు చేస్తే అందులో ఈ ఇద్దరివే 147. పవర్ ప్లేలో మార్ష్ వీరవిహారం చేస్తే మిడిల్ ఓవర్స్‌లో పూరన్ పూనకమొచ్చినట్టు ఆడాడు. ఈ సీజన్‌లో లక్నో తరఫున ప్యూర్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన మార్ష్.. అందుకు తగ్గట్టుగానే విజృంభించాడు. ఎదుర్కొన్న తొలి బంతినే డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా భారీ సిక్సర్‌తో అతడి విధ్వంసం మొదలైంది. స్టార్క్ మూడో ఓవర్లో 4, 6, 4 బాదిన అతడు.. 21 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. మార్క్‌రమ్ (15) నిరాశపరిచినా రెండో స్థానంలో పూరన్ రాకతో లక్నో స్కోరు వేగానికి పట్టపగ్గాల్లేకుండా పోయింది. విప్రజ్ నిగమ్ 7వ ఓవర్లో పూరన్ మూడు భారీ సిక్సర్లు కొట్టాడు. 17 పరుగుల వద్ద సమీర్ రిజ్వి క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన పూరన్ ఆ అవకాశాన్ని రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. వీళ్లిద్దరి దూకుడుతో లక్నో 9 ఓవర్లకే 100 పరుగుల మార్కును దాటింది. 12వ ఓవర్లో ముకేశ్ ఎట్టకేలకు మార్ష్‌ను ఔట్ చేయడంతో ఢిల్లీ ఊపిరి పీల్చుకుంది. కానీ ఢిల్లీకి ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. స్టబ్స్ 13వ ఓవర్లో పూరన్.. 6, 6, 6, 6, 4తో ఏకంగా 28 పరుగులు రాబట్టాడు. పంత్ డకౌట్ అవగా స్టార్క్ 15వ ఓవర్లో పూరన్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. డేవిడ్ మిల్లర్ (27 నాటౌట్) లక్నో స్కోరును 200 దాటించాడు.

**సంక్షిప్త స్కోర్లు:**

**లక్నో:** 20 ఓవర్లలో 209/8 (పూరన్ 75, మార్ష్ 72, స్టార్క్ 3/42, కుల్‌దీప్ 2/20);
**ఢిల్లీ:** 19.3 ఓవర్లలో 211/9 (అశుతోష్ 66 నాటౌట్, విప్రజ్ 39, శార్దూల్ 2/19, దిగ్వేశ్ 2/31)

# చిక్కుల్లో భజ్జీ

## ఆర్చర్‌పై జాత్యాహంకార వ్యాఖ్యలు!



హైదరాబాద్: టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ చిక్కుల్లో పడ్డాడు. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌పై అతడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్చర్ భారీగా పరుగులు సమర్పించుకున్న నేపథ్యంలో హిందీ కామెంట్రీ చెబుతున్న భజ్జీ.. 'లండన్‌లో నలుపు రంగు క్యాబ్స్ మీటర్ల మాదిరిగానే ఇక్కడ (మ్యాచ్‌లో) ఆర్చర్ మీటర్ సైతం పెరుగుతూనే ఉంది' అని వ్యాఖ్యానించాడు. దీంతో సోషల్ మీడియాలో భజ్జీపై విమర్శలు వెల్లువెత్తాయి. అతడి వ్యాఖ్యలు జాత్యాహంకారం కిందకే వస్తాయని ఆరోపిస్తూ..కామెంట్రీ నుంచి తప్పించాలని నెటిజన్లు డిమాండ్ చేశారు.



# టీడీసీఏ వన్డే టోర్నీ షురూ

## ప్రారంభించిన ఎంపీ రవిచంద్ర

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) అండర్-17 వన్డే టోర్నీ సోమవారం మొదలైంది. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి టీడీసీఏ చేస్తున్న కృషి అభినందనీయం. గ్రామీణ ప్రాంత క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకు ఇలాంటి టోర్నీలు నిర్వహించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ కబడ్డీ కెప్టెన్‌గా శివ



హనుమకొండ చౌరస్తా, మార్చి 24: పాట్నాలో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగే సబ్‌జూనియర్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ కబడ్డీ టీం కెప్టెన్‌గా హనుమకొండకు చెందిన రాసాల శివ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శివను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, కార్యదర్శి సారంగపాణి అభినందించారు. తాను ఈ స్థాయిలో ఎదగడానికి సహాయపడిన వారికి, జిల్లా కబడ్డీ సంఘానికి శివ కృతజ్ఞతలు తెలిపారు.

## తమీమ్‌కు గుండెపోటు

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మాజీ సారథి తమీమ్ ఇక్బాల్ స్వల్ప వ్యవధిలో రెండు సార్లు గుండెపోటుకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ లీగ్ (డీపీఎల్)లో భాగంగా మహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌కు సారథిగా వ్యవహరిస్తున్న అతడు మైదానంలోకి రాగానే ఛాతిలో తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడటంతో తమీమ్‌ను ఫజిలాతున్నెసాలోని ఓ దవాఖానాకు తరలించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని బీసీబీ ఒక ప్రకటనలో తెలిపింది.

## బ్యాడింటన్‌కు సుమిత్ గుడ్‌బై

హైదరాబాద్, ఆట ప్రతినిధి:భారత సీనియర్ షట్లర్ సుమిత్‌రెడ్డి..బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 2022 కామెన్వెల్త్ గేమ్స్ మిక్స్‌డ్ టీమ్ రజత పతక విజేత అయిన 33 ఏండ్ల సుమిత్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్‌మీడియాలో ప్రకటించాడు.ప్లేయర్‌గా వీడ్కోలు పలికిన సుమిత్..కోచ్‌గా కెరీర్ మొదలుపెట్టనున్నట్లు పేర్కొన్నాడు.

## శ్రీనిధి, చర్చిల్ బ్రదర్స్ పోరు డ్రా

గోవా: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. సోమవారం గోవాలో శ్రీనిధి, చర్చిల్ బ్రదర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరులో శ్రీనిధి తరఫున డేవిస్ కాస్టెండా(90+12ని) గోల్ చేయగా, పెపెగసామా(29ని) చర్చిల్ బ్రదర్స్‌కు ఏకైక గోల్ అందించాడు. లీగ్‌లో ప్రస్తుతం శ్రీనిధి 27 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.